సాక్షి
వికారాబాద్

సోమవారం ၊ 8 ၊ సెప్టెంబర్ ၊ 2025



సేవలు అంతంతే..!

గ్రామాలతో పాటు పలు మండల కేంద్రాల్లో కొనసాగుతున్న పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పూర్తిగా అందడంలేదు.

8లో▸



గిరి ప్రదక్షిణ

పౌర్ణమి సందర్భంగా ఆదివారం పాంబండ రామలింగేశ్వరాలయంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు.

8లో▸



వేతనాలు చెల్లించాలి

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు.

9లో▸

న్యూస్‌రీల్

అలయ్ బలయ్‌కు ఆహ్వానం



స్పీకర్‌తో బండారు దత్తాత్రేయ

అనంతగిరి: హైదరాబాదలో ప్రతీ ఏడాది నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్పీకర్ నివాసానికి వెళ్లి అక్టోబర్ 3న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కార్యక్రమ ఆహ్వాన పత్రిక అందజేశారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి

బంట్వారం: ఎస్ఎంఏఎం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్) పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వనున్నట్లు కోట్‌పల్లి ఏఓ కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం మిగిలిన వారికి 40 సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ పథకంలో కోట్‌పల్లి మండలానికి 250 బ్యాటరీ స్ప్రేయర్లు , 21 పవర్ ఆపరేటర్ స్ప్రేయర్లు, పది రోటావేటర్లు, కల్టివేటర్లు, డిస్కహారోలు, రెండు సీడ్ ఫెర్టిలైజర్ డ్రిల్, ఒక పవర్ టిల్లర్ కేటాయించారని చెప్పారు. అర్హులై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తుకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు జతపరిచి రైతు వేదికల్లో అందజేయాలని సూచించారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

అనంతగిరి: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పెన్షన్‌లను పెంచాలని కోరుతూ సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఈ హామీని మెనిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తు చేశారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న ఈ ధర్నాలో పెన్షన్‌దారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం విక్రయిస్తే రూ.5లక్షల జరిమానా

గిరిగేట్‌పల్లిలో మద్యపాన నిషేధం

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గిరిగేట్‌పల్లిలో మద్యపాన నిషేదం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం గ్రామస్తులంతా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని చర్చించారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా విధిస్తామని తెలిపారు. మద్యానికి బానిసై ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని.. అందుకే మద్యపాన నిషేధం అమలుకు నిర్ణయించామని మహిళలు, యువకులు ప్రకటించారు.

రేపు జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ ఆదివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఈనెల 9న (మంగళవారం) ఉదయం 10.30 నుంచి 2.30 గంటల వరకు హైదరాబాద్‌లోని మల్లేపల్లిలోని ఉపాధి కార్యాలయం ఐటీఐ క్యాంపస్‌లో జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని రిటైల్, ఈ-కామర్స్, బ్యాంకింగ్, వాయిస్ నాన్ వాయిస్ ప్రాసెస్, నాన్ ఐటీ, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో పోస్టులు ఉన్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ డిప్లమా పూర్తి చేసి ఉండాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. వివరాలకు 90630 99306, 89771 75394 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ట్రాఫిక్ కేసులపై లోక్‌అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీసు కేసుల పరిష్కారానికి సోమవారం నుంచి ఈనెల 13వ తేదీవరకు చేవెళ్ల కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వారు, ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి పెండింగ్ కేసులు తక్కువ జరిమానాతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆధార్‌కార్డు, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌లతో రావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 99632 95757, 94906 17461 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పల్లెలకు పాలనాధికారులు

నేడు కలెక్టరేట్‌లో జీపీఓలకు కౌన్సెలింగ్

- జిల్లాలో 236 రెవెన్యూ క్లస్టర్లు
- ప్రస్తుతం 163 క్లస్టర్లకు నియామకం

వికారాబాద్: గ్రామ పాలనాధికారులు త్వరలో విధుల్లో చేరనున్నారు. వారు రెవెన్యూ గ్రామాల బాధ్యతలు తీసుకునేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గతంలో వీఆర్‌ఓలుగా, వీఆర్‌ఏలుగా విధులు నిర్వహిస్తూ వచ్చిన వీరు గత ప్రభుత్వం వీఆర్‌ఓ వ్యవస్తను రద్దు చేయటంతో ఆయా కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్స్‌గా నియమితులైన విషయం విదితమే. ఎన్నికల హామీ మేకు వీఆర్‌ఓ వ్యవస్థను పునరుద్ధరించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని గ్రామపాలనాధికారులుగా నియమించాలని నిర్ణయించింది. ఇందుకు వీరికి పరీక్ష నిర్వహించి అర్హత ఆధారంగా ఎంపిక చేసింది. ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా గ్రామపాలనాధికారులు నియామక ప్రతాలు అందుకున్నారు. అనంతరం వారి స్థానికత ఆధారంగా కేటాయించిన జిల్లాలో చేరారు. జిల్లా నుంచి జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న 139 మంది జీఓపీలుగా రిపోర్టు చేశారు. జిల్లాకు సరిపడా జీపీఓలు లేక పోవడంతో రంగారెడ్డి జిల్లా నుంచి 24 మందిని కేటాయించారు.

పొరుగు నియోజకవర్గాల్లో పోస్టింగ్

అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్న జీపీఓలు వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరారు. ఉన్నతాధికారుల నిబంధనల ప్రకారం వారికి కౌన్సెలింగ్ నిర్వహిచి రెవెన్యూ క్లస్టర్ల వారీగా పోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా పోస్టింగులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. వీరికి పొరుగు నియోజకవర్గాల్లో పోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించినా.. ఆరోగ్యం, స్పౌజ్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకోనున్నారు. జీపీఓల నుంచి సైతం ఆప్షన్లు తీసుకునేలా ఫారంలు సిద్ధం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ముగిసిన తర్వాత అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం రెవెన్యూ క్లస్టర్లు కేటాయించాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 510 రెవెన్యూ గ్రామాలను 236 రెవెన్యూ క్లస్టర్లుగా విభజించారు. జిల్లాలో ప్రస్తుతం 163 మంది జీపీఓలు మాత్రమే అందుబాటులో ఉండడంతో ముందుగా 163 క్లస్టర్లకు జీపీఓలను కేటాయించి మిగతా క్లస్టర్లను అందుబాటులో ఉన్నవారికి అదనపు బాధ్యతలు ఇచ్చే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది.

ఇక పనులు వేగిరం

జీపీఓల రాకతో రెవెన్యూ వ్యవస్థలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రస్తుతానికి ఒక్కో జీపీఓకు మూడు నుంచి నాలుగు రెవెన్యూ గ్రామాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీఆర్వో వ్యవస్థ రద్దు తర్వాత తహసీల్దార్ కార్యాలయాల్లో పనిభారం పెరిగింది. ప్రస్తుతం ఒక్కరిద్దరు ఆర్ఐలు తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రైతు సమస్యల పరిష్కారంలో వీరి పాత్ర కీలకం. పై అధికారులకు నివేదించే ప్రతీ ఫైల్‌ను వీరు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు సిద్ధం చేయాల్సి ఉంటుంది. గతంలో వీరికి అసిస్టెంట్లుగా వీఆర్వోలు, వీఆర్ఏలు విధులు నిర్వహించే వారు. వీరిని తొలగించడంతో పనిభారమంతా ఆర్ఐలపైనే పడింది. దీంతో మూడేళ్లుగా ఆర్ఐలు సతమతమవుతూ వచ్చారు. ఈ ప్రభావం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లపైనా పడింది. రేషన్ కార్డులు, కులం, ఆదాయం, నివాసం, లీగలేయర్ తదితర సర్టిఫికెట్ల జారీతో పాటు ఇతర రెవెన్యూ సమస్యలు ఏవైనా ఫీల్డ్ వేరిఫికేషన్ బాధ్యతలు ఆర్ఐలపైనే ఉండటంతో పనిభారం పెరిగి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పురోగతి మందగించింది. ప్రస్తుతం జీపీఓల నియామకంతో మళ్లీ వ్యవస్థ గాడిన పడే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.



అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకుంటున్న జీపీఓలు

ఆలయాల మూసివేత



అనంతగిరి: పద్మనాభ ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు



తాండూరు: తాళం వేసిన భావిగి భద్రేశ్వర స్వామి ఆలయం

అనంతగిరి: చంద్రగ్రహనం సందర్భంగా అర్చకులు వికారాబాద్‌లోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. అనంతగిరి గుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయల తలపులను మధ్యా హ్నం 2గంటలకు మూసివేశారు. సోమవారం ఆలయ శుద్ధి అనంతరం ఉదయం 10 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు.

పాంబండలో రామలింగేశ్వరాలయం

కుల్కచర్ల: చంద్రగ్రహణం నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఆలయాలను మూసివేశారు. బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర ఆలయంలో ఉదయం 10గంటలకు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, అర్చకులు దశరథం ఆధ్వర్యంలో, మందిపల్‌లో ఆలయ అర్చకులు మఠం రాజశేఖర్ ఆలయం గేట్లకు తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ సంప్రోక్షణ అనంతరం సోమవారం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

ఆలయాలకు తాళం

తాండూరు: తాండూరు నియోజవకర్గంలోని ఆలయాలను ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేశారు. పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయం, కాళికాదేవి ఆలయం, రసూల్‌పూర ఆంజనేయ స్వామి దేవాలయం, పాత తాండూరులోని కోటేశ్వర ఆలయం, సీతారాంపేట్ పాండురంగ దేవాలయం, నగరేశ్వర స్వామి దేవాలయం, చంద్రగిరి వెంకటేశ్వర స్వామి ఆలయాల గేట్లు మూసి తాళం వేశారు. సోమవారం ఉదయం 10గంటల తర్వాత భక్తులకు దర్శనం ఉంటుందని చెప్పారు.



కుల్కచర్ల: పాంబండ ఆలయాన్ని మూసివేస్తున్న పాలకవర్గం

పాత అలైన్‌మెంట్‌నే పాటించండి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి భూ నిర్వాసితుల నిరసన

పూడూరు: ట్రిపుల్ ఆర్ పరిధిలో భూములు కోల్పోతున్న బాధితులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడంతో మండల కేంద్రంలోని 60 మంది రైతులు భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్ ఆర్ నిర్మించాలని కోరారు. భూములు ఇచ్చేది లేదని.. ఎంతవరకైనా పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నూతన జేఏసీ ఏర్పాటు

ట్రిపుల్ ఆర్ భూ బాధితుల జేఏసీ కన్వీనర్‌గా పి.వెంకట్‌రెడ్డి, కోకన్వీనర్లుగా నవీన్ జ్యోషి, మైబెల్లి, సభ్యులుగా సాయిరెడ్డి, శర్బలింగం, నవాజ్, గౌరేశం, అమర్‌నాథ్, జబ్బార్, మున్నీర్, సాధకాలిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్లు నరసింహారెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాయకులు తాజుద్దీన్, మల్లేశం, శ్యాంసుందర్ రెడ్డి, సతీశ్ పంతులు, రామచంద్రయ్య హరీశ్వర్ రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 12 నుంచి ఏఐపై జాతీయ సదస్సు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనం ఆవరణలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె తెలిపారు. గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 12, 13 తేదీల్లో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యక్ష పద్ధతి (ఆఫ్‌లైన్), పరోక్ష పద్ధతి (ఆన్‌లైన్)లో సెమినార్ ఉంటుందన్నారు. ప్రజెంటేషన్ ఇచ్చేవారు తగిన రుసుము చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రజెంటేషన్ ఇచ్చేందుకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తున్నారని, ఉత్తమ ప్రజెంటేషన్ ఇచ్చిన వారికి బహుమతులు, ప్రజెంటేషన్‌లో పాల్గొన్న వారిందరికీ కిట్స్, సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. వివరాలకు 97034 41345, 97059 67553, 79010 97702 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'స్థానికం'గా సత్తా చాటుదాం

- ప్రతీ గ్రామం నుంచి జీజేపీ అభ్యర్థులు పోటీ చేయాలి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

మర్పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామం నుంచి బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన సిరిపురంలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశానికి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు. రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకుని పోటీకి ఆసక్తి ఉన్న ఆశావహుల వివరాలు సేకరించారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా సమష్టిగా అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు, బయోడేటా తీసుకున్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్టానానికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కోఆర్డినేటర్ రాములు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా మాజీ కార్యదర్శి బలరాం గౌడ్, నాగన్న, మండల కోఆర్డినేటర్ యాదవరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్‌కుమార్, నాయకులు జైపాల్, మహేశ్వరి, సునిల్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, సుభాశ్ తదితరులు ఉన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు



విజేతలకు మెడల్స్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: కరాటే నేర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని మోకిలలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి సక్సెస్ షోటోకాన్-2025 చాంపియన్ పోటీలను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు ప్రారంభించగా.. ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పోటీలను టి.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా మోకిలకి చెందిన మన్నె వెంకటేశ్ స్పాన్సర్ చేశారు. పలు జిల్లాలకు చెందిన సుమారు 500 మంది 5 నుంచి 16 ఏళ్లలోపు చిన్నారులు తమ ప్రతిభ చాటారు. కార్యక్రమంలో సక్సెస్ షోటోకాన్ టెక్నికల్ అడ్వైజర్ రవీందర్, ఫౌండర్ అనిల్ కుమార్, కోచ్‌లు శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

మాజీ మంత్రుల ప్రత్యేక పూజలు

కందుకూరు: మండలంలోని లేమూరు పరిధి లోని శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం మాజీ మంత్రులు కె.జానారెడ్డి, జి.చిన్నారెడ్డి, డీకే సమరసింహారెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం గురించి ట్రస్ట్ చైర్మన్ గూడూరు కొండారెడ్డి, దేవాలయ విశిష్టత గురించి స్థపతి శివనాగిరెడ్డి వారికి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేశ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, పాండు, కె.జైపాల్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరాలయంలో జానారెడ్డి, చిన్నారెడ్డి, డీకే సమరసింహారెడ్డి తదితరులు

ఎత్తే సవాలైంది!

ఈసారి గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఆలస్యం

- విగ్రహాల ఎత్తు పెరగడమే దీనికి కారణం
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉదంతాలు
- 40 గంటలు అవిశ్రాంతంగా విధులు : సీపీ ఆనంద్



మాట్లాడుతున్న నగర కొత్వాల్ సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన శోభాయాత్ర ఆదివారం తెల్లవారుజామున ముగిసినా హుస్సేన్‌సాగర్‌లో విగ్రహాల నిమజ్జనం మాత్రం అర్ధరాత్రి వరకు కొనసాగింది. సోమవారం ఉదయానికి ఇది పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈసారి మండపాల సంఖ్యతోపాటు విగ్రహాల ఎత్తూ గణనీయంగా పెరిగిపోవడంతోనే నిమజ్జన ప్రక్రియలో కొంత జాప్యం జరిగినట్లు నగర కొత్వాల్ సీపీ ఆనంద్ ప్రకటించారు.

'ఆఫ్‌లైన్'లో రెట్టింపు వరకు..

నగర కమిషనరేట్ పరిధిలో గణేశ్ మండపాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది మొత్తం 12,030 విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. అనుమతులు తీసుకోకుండా మరో 40 వేల మండపాలు ఏర్పాటయ్యాయి. క్షేత్రస్థాయి అధికారులు ఆఫ్‌లైన్ విధానంలో వాటి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయా గణపతి విగ్రహాల ఎత్తు, నిమజ్జన ఊరేగింపు మార్గం తదితరాలను గుర్తిస్తూ అది నిమజ్జనం అయ్యే వరకు పర్యవేక్షించారు. దీనికోసం ప్రతి విగ్రహానికి ఓ క్యూఆర్ కోడ్ కేటాయించారు. ఈ మండపాల నుంచి నిమజ్జనం జరిగే ప్రాంతం వరకు ప్రతి మార్గాన్నీ పర్యవేక్షించిన అధికారులు అడ్డంకులు లేకుండా కృషి చేశారు.

'లెక్కల్లో'లేని ఆ విగ్రహాలు

నగరంలో ఏర్పాటైన కొన్ని విగ్రహాలతోపాటు పొరుగు కమిషనరేట్లు, జిల్లాల నుంచి వచ్చిన విగ్రహాల ఊరేగింపులతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. వీటిలో కొన్ని ఏకంగా 40 అడుగుల ఎత్తు ఉన్నాయి. ఫలితంగా ఆయా మార్గాల్లో ఉన్న కొన్ని కరెంట్ వైర్లు, చెట్లు, కేబుల్ తీగలు విగ్రహాలకు అడ్డంకులుగా మారాయి. మొనప్ప ఐలాండ్-రాజ్‌భవన్ మార్గంలో శనివారం రాత్రి ఓ విగ్రహం చెట్టు కొమ్మలకు తగిలి వాహనంపైనే వెనక్కు ఒరిగిపోయింది. దీంతో పంజగుట్ట ప్రాంతంలో రిజర్వ్‌లో ఉంచిన క్రేన్‌ను తీసుకువచ్చి విగ్రహానికి ఎలాంటి నష్టం లేకుండా వాహనంపై నిలబెట్టారు. ఇలా మరికొన్ని చోట్లా జరగడంతో ఆయా మార్గాల్లో వాహనాలు ఆగిపోయి శోభాయాత్రకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

నెక్లెస్‌రోడ్‌లోకి చేరిన 900 విగ్రహాలు

ఈ ఏడాది మూడోరోజు నుంచి పదకొండో రోజు వరకు దాదాపు 1.4 లక్షల విగ్రహాలు నిమజ్జనమైనట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో 1.2 లక్షల విగ్రహాలు బేబీ పాండ్స్, ఇతర చిన్న చెరువుల్లో నిమజ్జనం కాగా.. మిగిలినవి హుస్సేన్‌సాగర్‌సహా ఇతర చెరువుల్లో జరిగాయి. ఐదడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న 4,700 విగ్రహాలు శనివారం ఉదయం నుంచి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నానికి దాదాపు 900 విగ్రహాలతో ఉన్న లారీలు మిగిలిపోవడంతో వీటిని నెక్లెస్ రోడ్డులోకి మళ్లించారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్కు వద్ద ఉన్న కొన్ని క్రేన్ల ద్వారా నిమజ్జనం చేస్తున్నారు. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు పాక్షికంగా ఎత్తేశారు. సోమవారం తెల్లవారుజాముకు ఈ క్రతువును సంపూర్ణం చేసి, ఆంక్షల్ని ఎత్తేయనున్నారు.

మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు

ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సహకారంతో బడా గణేశుడి నిమజ్జనం గతేడాది కంటే ముందుగా పూర్తయింది. మాకు సహకరించిన ఉత్సవ సమితితోపాటు మండపాల నిర్వాహకులకు కృతజ్ఞతలు. ఊరేగింపుల్లో జరిగిన చిన్నచిన్న ఘర్షణలపై వివిధ ఠాణాల్లో ఐదు కేసులు నమోదయ్యాయి. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన 170 మంది పోకిరీలతోపాటు జేబుదొంగల్ని పట్టుకున్నాం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఇలాంటి నేరాల సంఖ్య తగ్గింది. సామూహిక నిమజ్జనం కోసం దాదాపు 40 గంటల నిర్విరామంగా పని చేసిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు.

– సీపీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

క్లుప్తంగా

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



జీహెచ్‌ఎంగా పదోన్నతి పొందిన రూప్‌సింగ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

దోమ: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రే కీలకమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలోని ఆయన నివాసంలో జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. దిర్సంపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రూప్‌సింగ్‌కు ఇటీవలే జీహెచ్‌ఎంగా పదోన్నతి లభించడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులపై సీసీఐ నిర్లక్ష్యం

సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప



సునందమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న శరణప్ప

తాండూరు రూరల్: మండల పరిధి కరన్‌కోట్ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప మండిపడ్డారు. సీసీఐ ఫ్యాక్టరీ రిటైర్డ్ కార్మికురాలు సునందమ్మ(65)అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు సైతం డబ్బులు లేక పోవడంతో గ్రామస్తులు, కార్మిక సంఘం నాయకులు కలిసి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా శరణప్ప మాట్లాడుతూ.. సీసీఐ ఫ్యాక్టరీలో పని చేసిన కార్మికురాలికి యజమాన్యం గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వలేదన్నారు. ఆమె కుమారులు వెంకటేశం, నరేష్ కోడలు నర్మమ్మ ఫ్యాక్టరీలో పని చేసి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. వారికి సైతం గ్రాట్యుటీ, పెన్షన్ బెనిఫిట్స్ అందజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా రామచంద్రానగర్‌కు చెందిన సయ్యద్ అనాస్ కుమారుడు సయ్యద్ జకీ(20) షాహీన్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో పని చేస్తున్నాడు. ఉదయం 6.50 గంటలకు విధులు ముగించుకొని తన బంధువు ఒబేదుల్లా ఖాన్(19)తో కలిసి పల్సర్ బైక్‌పై షాహీన్‌నగర్ నుంచి బార్కాస్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉస్మానియా హోటల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఒవైసీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే జకీ మృతి చెందాడు. మరో యువకుడు చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుడు సయ్యద్ జుహేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిమజ్జనంలో ఘర్షణ

పలువురిపై కేసుల నమోదు

కొత్తూరు: గణపతి నిమజ్జనంలో ఘర్షణకు పాల్పడిన ఇరువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శనివారం.. నేతాజీ యువజన సంఘం ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొనగా.. అదే కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆదివారం ఇరు వర్గాల వారిపై కేసు నమెదు చేశామని పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని, మహిళకు గాయాలు

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన సరిత, కుటుంబ సభ్యులు కలిసి మొయినాబాద్‌కు వలస వచ్చారు. సరిత సజ్జన్‌పల్లి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో ఆమె కూలీ పనిచేస్తోంది. ఆదివారం రాత్రి పని ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో.. మండల పరిధి అప్పారెడ్డిగూడ గేటు దాటుతుండగా చేవెళ్ల నుంచి మెహదీపట్నం వెళ్తున్న ఆర్టీసీ మెట్రో(అద్దె) బస్సు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ బస్సును అక్కడే వదిలేసి పారిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా.. ఆమెను చికిత్సకోసం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

పీహెచ్‌సీలో సేవలు అంతంతే..!

- 24 గంటలకు అప్‌గ్రేడ్‌కాని దౌల్తాబాద్ ఆస్పత్రి
- సాయంత్రం, రాత్రిళ్లు అందని వైద్యం
- ఇబ్బందుల్లో మండలవాసులు
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: గ్రామాలతో పాటు పలు మండల కేంద్రాల్లో కొనసాగుతున్న పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పూర్తిగా అందడంలేదు. కొన్ని అప్‌గ్రేడ్ కాకపోవడంతో 8 గంటలే సేవలు అందిస్తున్నారు. దౌల్తాబాద్ పీహెచ్‌సీ ఏర్పాటై దాదాపు 25 ఏళ్లవుతున్నా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని వేళలను పరిమితం చేశారు. 24 గంటల ఆస్పత్రిగా చేయాలని పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు, సిబ్బంది పని వేళలు పాటించాల్సి ఉండడంతో సాయంత్రం నాలుగింటికి ఆస్పత్రికి తాళం వేసి వెళ్లి పోతున్నారు. దీంతో సాయంత్రం, రాత్రి సమయాల్లో ప్రజలకు అత్యవసర సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యానికి గురైనా, రోడ్డు ప్రమాదాలు సంభవించినా, కుక్క కాటుకు గురైనా సాయంత్రం, రాత్రి వేళల్లో కొడంగల్, తాండూరు, కోస్గి తదితర ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిందే. ఇదే విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారు. మండలంలోని 34 గ్రామాలకు కలిపి దౌల్తాబాద్ పీహెచ్‌సీయే పెద్దది. ఇందులో మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషన్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు. నిత్యం 80కిపైగా ఓపీ కేసులు నమోదవుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో 24 గంటల ఆస్పత్రిగా మారుస్తే రోగులకు సౌకర్యంగా ఉంటుందని సూచిస్తున్నారు.

ప్రసవాలు లేవు..

పీహెచ్‌సీ కేంద్రాల్లో ప్రసవాలు తప్పనిసరిగా జరగాలని జిల్లా వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో సరైన సదుపాయలు లేకపోవడంతో చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం రెండు పడకలే ఉండడంతో సేవలు అందడంలేదు. 24 గంటల ఆస్పత్రిగా మార్చి వైద్యసేవలు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారిణి ప్రియదర్శిని వివరణ కోరగా 24గంటల ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు.

నా కూతురు చనిపోయింది..



నా కూతురుకు జ్వరం వచ్చింది. అయితే రాత్రి సమయంలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాను. ఉదయం గొంతు నొప్పితో పాటు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే మూసి ఉంది. తెలియక ప్రైవేట్ వాహనంలో కోస్గికి తీసుకెళ్తుంటే మార్గమధ్యలో చనిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిని 24 గంటల ఆస్పత్రి చేసి ఉంటే నా కూతురు బతికేది.

– కిష్టప్ప, దౌల్తాబాద్, స్థానికుడు

● కోట్‌పల్లి అందాలు.. కనువిందు



బోటింగ్ చేస్తున్న యువత

కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలు.. కట్టిపడేసే నల్లని మేఘాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలనుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అక్కడి ప్రకృతి అందాలకు మైమరచిపోయారు. ఈ సందర్భంగా బోటింగ్ చేసి సందడి చేశారు. అలుగు పైనుంచి కిందకు ప్రవహిస్తున్న నీటిలో గెంతులేసి ఎంజాయ్ చేశారు. అనంతరం ప్రాజెక్టు వద్ద భోజనాలు చేసి వెనుదిరిగారు. – ధారూరు



అలుగు నీటిలో ఎంజాయ్ చేస్తున్న పర్యాటకులు

నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా



బోరు వద్ద నీటికోసం నిలుచున్న గ్రామస్తులు

ఐదు రోజులుగా ఇబ్బందులు

- ప్రైవేట్ బోర్ల నుంచి తెచ్చుకుంటున్న ప్రజలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న హస్నాబాద్, ఆలేడ్ గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్, హస్నాబాద్ గ్రామాల్లో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. హస్నాబాద్ గ్రామ సమీపంలో పైపులైన్ పగిలిపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని చెబుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో గ్రామంలోని కొందరు ప్రైవేట్ బోర్లు, సమీప బావుల నుంచి తెచ్చుకుంటున్నట్లు చెబుతున్నారు. కనీసం అధికారులు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలినపైపులైన్‌ను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



కుల్కచర్ల: గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు



దోమ: వీరభద్రేశ్వర ఆలయంలో ప్రదక్షిణ

కుల్కచర్ల: పౌర్ణమి సందర్భంగా ఆదివారం పాంబండ రామలింగేశ్వరాలయంలో గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు రుద్ర హోమం నిర్వహించి అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మహిపాల్ రెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, అర్చకులు పాండు శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం

దోమ: మండల పరిధిలోని గూడూరులో ఆదివారం గ్రామస్తులు వీరభద్రేశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు జంగం శివ ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శేరి రాంరెడ్డి, శివ కుమార్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సతీశ్ కుమార్, ఆనంద్ కుమార్, బుగ్గారెడ్డి, ప్రసాద్‌కుమార్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పోటీపడి.. వేలంవేసి

చవితి ఉత్సవాల్లో భాగంగా నవ రాత్రులు పూజలందుకున్న వినాయకుడి చేతిలోని లడ్డూలకు మహాక్రేజీ ఏర్పడింది. కలిసి వస్తుందన్న విశ్వాసంతో.. వేలంలో దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. రూ.లక్షలు వెచ్చించి కైవసం చేసుకున్నారు.



షాబాద్: స్వామివారి ప్రసాదంతో భక్తుడు చెన్నయ్య తదితరులు



శంకర్‌పల్లి: విఠలేశ్వర ఆలయం వద్ద భక్తులు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ రెడ్డి సోదరులు



శంకర్‌పల్లి: మాసానిగూడలో లడ్డూ సొంతం చేసుకున్న శ్రీశైలం



శంకర్‌పల్లి: లడ్డూతో శేరిగూడ మాజీ సర్పంచి సత్యనారాయణ



తుక్కుగూడ: లడ్డూతో భక్తుడు కేధార్నాథ్

- గణపతి లడ్డూల కైవసం
- రూ.లక్షలు వెచ్చించిన భక్తులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ, మండలంలో గణనాథుల లడ్డూ ధరలు భారీగా పలికాయి. విఠలేశ్వర ఆలయంలో కొలువైన గణనాథుని లడ్డూని ఏనుగు పవన్ కుమార్‌రెడ్డి, అనిల్ రెడ్డి సోదరులు రూ.9,11,116 లక్షలకు, బుల్కాపూర్ హనుమాన్ మందిర్‌లో మణికొండ మల్లారెడ్డి రూ.8 లక్షలకు దక్కించుకున్నాడు. మండల పరిధి శేరిగూడలో మాజీ సర్పంచి సత్యనారాయణ రూ.9లక్షలు, మాసానిగూడ హనుమాన్ మందిరంలో కుర్మ సంఘం శంకర్‌పల్లి ఉపాధ్యక్షుడు శ్రీశైలం రూ.7.20 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మహా ప్రసాదాలను కైవసం చేసుకున్న భక్తులను.. ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

రూ.13.50 లక్షలకు..

తుక్కుగూడ: పురపాలిక కేంద్రంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూకు ఆదివారం వేలం పాట వేయగా.. భక్తుడు ముప్పిడి కేధార్నాథ్ సోదరులు రూ.13.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మాంచి, ప్రసాదం అందజేశారు. అనంతరం గణపతిని నిమజ్జనం చేశారు.

రూ.18 లక్షలకు..

షాబాద్: షాబాద్ గ్రామంలో 11 రోజుల పాటు పూజలు అందుకున్న గణపతి లడ్డూకు శనివారం రాత్రి నిర్వహించిన వేలం నిర్వహించారు. ఈ పాటలో సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య రూ.18 లక్షల 11 వందల 11లకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో తమ్మలి రవీందర్, జడల రాజేందర్‌గౌడ్, వెంకట్ యాదవ్, కావలి మహేశ్ యాదవ్, దర్పల్లి రవీందర్‌గౌడ్, దండు రాహుల్‌గుప్తా, కమ్మరి శ్రీను, గడ్డం చంద్రయ్య పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

ఇద్దరిపై కేసు మోదు

యాచారం: ఓ బాలికపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నందివనపర్తి గ్రామానికి చెందిన మైనర్(14)ను అదే గ్రామానికి చెందిన జి.క్రాంతి, బి.క్రాంతిలు రాత్రి వేళలో మాయమాటలు చెప్పి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. అక్కడ బాలికపై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడ్డారు. సమాచారం మేరకు అదే రాత్రి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి, చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆదివారం ఇద్దరిపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ, పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

యూరియా వచ్చింది.. కలత తీరింది!



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

యాచారం: యూరియా కొరత కారణంగా నిన్నమొన్నటి వరకు కర్షకులు కలత చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. సాగు పనులు వదిలి.. శాంతపొడవుగా పీఏసీఎస్, ఫర్టిలైజర్ దుకాణాల వద్ద గంటల కొద్దీ క్యూ కట్టారు. దీనికి స్పందించిన ప్రభుత్వం, అధికారులు.. 'యూరియా కోసం రైతులు ఇబ్బంది పడొద్దు. అవసరం మేరకు స్టాక్ వస్తోంది. అందరికీ అందజేస్తాం' అని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగతా ప్రాంతాల్లో ఎలా ఉన్నా.. తాజాగా సెలవు రోజైన ఆదివారం.. యాచారం మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా పంపిణీ చేశారు. 450 మందికి టోకెన్లు ఇచ్చి, పోలీసుల సమక్షంలో ఒకొక్కరికి రెండు బస్తాల చొప్పున అందజేశారు. సరఫరా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గత నాలుగైదు దఫాలుగా యూరియా కోసం వందలాది మంది రైతులు ఆందోళన చెసిన విషయం విదితమే.

లాభాల 'బంతి'

ఉద్యాన పంటలతో లాభాల పంట పడుతుంది. నీటి వసతి కలిగిన ప్రాంతం.. బంతి సాగుకు అనుకూలమైనది. తక్కువ పెట్టుబడితో, యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



సర్దార్‌నగర్‌లో బంతి తోట

సిరులు కురిపిస్తున్న సాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- యాజమాన్య పద్ధితిని అవలంబిస్తే మేలు
- చేవెళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కీర్తి



షాబాద్: ఉద్యానపంటల సాగులో డ్రిప్ పద్ధతిని అవలంభిస్తే నీటిని పొదుపు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. పండుగలు, ఇంటి గుమ్మాల అలంకరణకు, ఆలయాల్లో నిర్వహించే పూజలకు అవసరమయ్యే బంతి పూలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. తక్కువ నీటి వనరులతో బంతిని సాగు చేస్తూ, సస్యరక్షణ చేపడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చు అని చేవెళ్ల డివిజన్ ఉదాన్యవన శాఖ అధికారి కీర్తి తెలిపారు. అన్ని కాలాల్లో అనుకూలంగా సాగు చేసే బంతిపై సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే..

ఏపుగా పెరిగితే..

బంతిలో ఆఫ్రికన్, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ ఉన్నాయి. నీటి వసతి కలిగిన అన్ని కాలాలు, సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలలు బంతి సాగుకు అనుకూలం. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి. బంతి మొక్కలు ఏపుగా పెరిగితే, పూల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. సాగుకు విత్తనాల ద్వారా లేదా కత్తిరింపుల ద్వారా ప్రవర్ధనం చేయవచ్చు.

కోతకు ముందు నీరుపడితే..

నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి. నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చేవరకు నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోయాలి. అదీ ఉదయం లేదా సాయంత్రం మాత్రమే కోయాలి. కోతకు ముందు నీటి తడి ఇచ్చినట్లయితే పూలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదుటున్నుల దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ చర్యలు

పేను.. పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వాటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రొటోఫాస్ 1.5 మిలీను కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తామర పురుగులు.. ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రొటోఫాస్ 1.5 మిలీ.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొగ్గతొలిచే పురుగులు.. లార్వాలు పూల మొగ్గలను తొలిచేస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మిలీను.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువుల వాడకం

మడులను తయారు చేసే సమయంలో బాగా చివికిన పశువుల ఎరువు ఎకరానికి 20 టన్నులు వేసి కలియ దున్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పట్టాలి. పాలిడాల్ పొడి చల్లడం వలన చీమలు, చెదను నివారించుకోవచ్చు. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి.

తెగుళ్లు, నివారణ

నారుకుళ్లు తెగుళ్లు: నీటి తడి ఎక్కువగా ఉండి, వేడిగా ఉన్న చోట ఈ తెగులు వ్యాపిస్తుంది. లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రాముల కాప్టాన్ మందుతో తడపాలి. ఆకు మచ్చ తెగులు: మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.